# స్కిల్ గేమ్సు



"నాన్నా టౌన్‌కెళ్ళొస్తా" అని చెప్పుల్లో కాళ్ళు దూరుస్తూ అన్నాడు రమణ.

"ఎందుకు?" అనబోయిన రాఘవయ్య మాటలు మింగివేసి జేబులోంచి పచ్చ నోటు తీసి కొడుకు చేతిలో పెట్టాడు.

రమణ ఇస్త్రీ పంచె కట్టి గ్లాస్కో లాల్చీ వేసుకున్నాడు. ఎలిమెంటరీ స్కూలుతో చదువుకు నామం పెట్టిన దగ్గర్నుంచీ కష్టపడి పొలం పనులు చేస్తూ తండ్రికి చేదోడుగా వుంటున్నాడు. మాఘ మాసంలో పెళ్ళి అయింది కూడా. అయితే అత్త చాదస్తం కొద్దీ ముహూర్తాలు లేవని మిగిలిన కార్యక్రమం వాయిదా వేయిస్తున్నది.

రాఘవయ్య కొడుకుకు తెలియకుండా వారిచేత వియ్యపురాలికి కబుర్లు చేయిస్తూనే వున్నాడు. ఆఖరుసారిగా కబురుచేసినప్పుడు "ఇంకా నాల్నెల్ల దాకా మంచి రోజుల్లేవు" అని చెప్పిందామె.

"ఒక్కగానొక్క కూతుర్ని వదలలేక ఈ వంకలు పెడుతుంది!" అని మనసులో అనుకుని పైకి మాట్లాడకుండా వూరుకున్నాడు.

రమణ పెళ్ళికాక ముందున్నంత నిగ్రహంగా వుండలేకపోవడం చూసిన దగ్గర్నుంచీ రాఘవయ్య మనసులో ఆరాటం ఎక్కువైనా చేసేది లేకవూరుకున్నాడు.

పండగ పూట పట్నానికి బయల్దేరిన కొడుకు వంక చూస్తుంటే గడచిన విషయాలు గుర్తొచ్చి "రేపు నేనే స్వయంగా వెళ్ళి త్వరగా ముహూర్తం పెట్టించమని వియ్యపురాల్ని చివాట్లెట్టి వస్తాను" అనుకున్నాడు రాఘవయ్య.

కొత్త హీరో సైకిల్ మీద టౌన్‌కు బయల్దేరిన రమణకు దారిలో కిశోర్ కలిశాడు.

"బస్సు దొరక లేదా? రా కూర్చో" రమణ పిలవగానే వచ్చి సైకిల్ స్టాండు మీద కూర్చున్నాడు కిశోర్.

అయిదో తరగతి దాకా రమణ, కిశోర్ కలిసే చదివారు. రమణ చదువు మానేసిన తర్వాత కిశోర్ స్కూలు చదువు పూర్తిచేసి కాలేజీ చదువుతో కుస్తీ పడుతున్నాడింకా!

"ఎక్కడికిరా రమణా?! రాక రాక బస్తీకి వస్తున్నావ్?"

"సినిమాకని బయల్దేరా"

"ఏమి సినిమాలున్నాయిరా? అన్నీ చెత్తా చెదారం"

"ఉన్నదాంట్లోనే ఏదో వొకటి చూస్తా."

"హైస్కూల్ కుర్రాడిలా ఏమిటా మాటలు?"

"మరి ఏం చేద్దాం?"

"కొత్తగా టౌన్ బయట ఎమ్యూజ్‌మెంట్ పార్క్ పెట్టారు వెళ్దాం పద."

"పార్క్‌కా?!"

"అవును బలే వుషారుగా కాలం గడపొచ్చు"

"సరే"

పార్క్ గేటు దాటగానే "అరేయ్ దప్పి కేస్తుంది రారా" అంటూ బార్‌లోకి దారి తీశాడు కిశోర్.

అయిష్టంగా వెంట వెళ్ళాడు రమణ.

బ్రాందీ సోడా ఆర్డరిచ్చాడు కిశోర్. వద్దురా అంటే ఎద్దేవా చేస్తాడేమోనని మిన్నకుండిపోయాడు రమణ.

పెగ్గు మీద పెగ్గు ఖాళీ చేశారు మిత్రులు. రమణ జేబులో మూడొంతులు డబ్బయిపోయింది.

"పదరా పోదాం!" ముందుకు నడిచాడు కిశోర్. తూలుతూ వెంటనడిచాడు రమణ

చెస్, కారంబోర్డు, పేకాట జోరుగా ఆడుతున్న యువకులను చూస్తూ ముందుకు కదిలారు.

"షూట్ రాజా షూట్" అని అరుస్తున్న వ్యక్తి ముందాగాడు కిశోర్.

ఎదురుగా వున్న బెలూన్లను గురి చూసి కొడుతున్నాడొకతను. అతను వెళ్ళిపోగానే రైఫిల్ తీసుకుని రమణ కిచ్చాడు కిశోర్.

రమణకు రైఫిల్ గురిచూసి షూట్ చేయడం ఎలాగో నేర్పించాడు కిశోర్.

టాప్ టాప్‌మని వరుసగా బెలూన్లు పేల్చేశాడు రమణ.

"భేష్" చప్పట్లు చరిచాడు కిశోర్.

షూటింగ్ పెవిలియన్ దగ్గర్నుంచీ కదిలేప్పటికి రమణ జేబులో పది రూపాయిలే వుంది.

"కాయ్ రాజా కాయ్" దూరాన్నుంచి శబ్దం వస్తున్న దిశగా వెళ్ళారు కిశోర్, రమణ. అప్పటికే రమణ మనసు కళ్ళెం తెంచుకున్న గుర్రంలా పరుగెత్త సాగింది ఎదురుగా కనపడుతున్న దృశ్యాన్ని చూసి.

"కమాన్ రాజా కమాన్" చక్రం వెనుక నిల్చుని అరుస్తుంది చపలాక్షి.

కళ్ళప్పగించి చూడసాగాడు రమణ.

యవ్వనమదంతో విరగబూసిన బొప్పాయి చెట్టులా వెలిగిపోతున్నదా యువతి.

"కాయ్ రాజా కాయ్ రూపాయికి పది రూపాయిలు" అంది యువతి.

"ఏం చేద్దాం?" అన్నట్లు కిశోర్ వంక చూశాడు రమణ. మదనుడు ఎక్కుపెట్టి వేసిన బాణాలు వొకేసారి గుచ్చుకున్నట్లు అతని మనసులో వేడి అధికం కాసాగింది.

రమణ జేబులో పది రూపాయిల నోటు తీసి కళావరు అనుమీదుంచాడు కిశోర్.

స్విచ్ నొక్కింది యువతి. చక్రం గిర్రున తిరిగి ఆగింది. పాయింటర్ కళావర్ ఆసు పక్క గదిలో ఆగింది.

పది రూపాయిల కాయితం తీసుకుని "కాయ్ రాజా కాయ్" అంది యువతి కవ్విస్తున్నట్లు.

"డబ్బులయిపోయాయిరా" అన్నాడు రమణ మెల్లగా కిశోర్ చెవిలో.

"పర్లేదు చేతికి వాచీ వుందిగా" అన్నాడు కిశోర్ ఇంకా నెమ్మదిగా. చేతి వాచి తీసి ఆఠీను ఆసు మీదుంచాడు రమణ.

"భేష్!" అన్నాడు కిశోర్ మెచ్చుకోలుగా.

"వాచీయా?!" అంది యువతి.

"అవును నేను గెలిస్తే నువ్వు నాకు పది వాచీ లివ్వాలి" అన్నాడు రమణ.

"వారేయ్ నొద్దురా! పది వాచీలేం చేసుకుంటావ్!"

"మరి?!"

"నువ్వు గెలిస్తే చపల వంటి మీద నుండి వొక వస్త్రం తీసి కింద పడేస్తుంది" కన్ను చికిలిస్తూ అన్నాడు కిశోర్.

"సై" అన్నట్లు తలాడించింది చపల.

మన్మథుడు మరొకసారి రమణ గుండెల మీదకు ఎక్కుపెట్టిన బాణాలు వదిలాడు. వుషారుగా ఈల వేశాడు రమణ.

"కాయ్ రాజా కాయ్" చక్రం తిరగడం ఆగింది. పాయింటర్ ఆఠీను ఆసు మీద ఆగింది.

"వండర్ ఫుల్!" రమణ వీపు మీద చరుస్తూ అరిచాడు కిశోర్.

చపల కళ్ళు క్షణం వెలాతెలా పోయాయి. 'తప్పదా' అన్నట్లు రమణ వంక చూసింది. రమణ చూపుల తీక్షణత తట్టుకోలేనట్లు తల వంచుకుంది.

క్షణమాగి - వేప చెట్టును చుట్టుకున్న మాధవీలతలా వంటిమీద అల్లుకున్న నైలెక్సు చీరెను బహు నెమ్మదిగా విప్పి అవతల పడేసింది.

మెరుపు కాంతిలో తళతళలాడే ఎర్ర గులాబీ లాటి చపల దేహాన్ని ఆపాదమస్తకం విలోకించసాగాడు రమణ. లోపావడా జాకెట్ ఆమె అందాల్ని దాచలేక సతమతమైపోవడం అతనికి వుషారిచ్చింది.

రమణ చూపులు పై నుండి కిందకు,

డా॥ కొత్త రవీంద్ర బాబు

కింద నుండి పైకి ఆమెలో దారంలా నర లాయి. చివరకు అతని చూపులు ఒక చోట నిలిచిపోయాయి.

ఇబ్బందిగా చూస్తూ 'కాయ్ రాజా కాయ్' అంది చపల.

రమణ వాచీ, వుంగరం తీసి ఇస్పేట్ ఆసు మీదుంచాడు.

"అదే పందెం!" అన్నాడతను వుషారుగా.

"తప్పదా?" అన్నట్లు చూచింది చపల.

"కానియ్" అన్నాడు రమణ. బ్రాంది రక్తంలో కలిసి యిస్తున్న ఉత్తేజం అతనిలో కోరికల సెలయేర్లను ప్రవహింపజేయసాగింది.

చక్రం తిరగడం మొదలైంది. కాని రమణ కళ్ళు చపల వంటిమీద ఆచ్ఛాదనను ఒకటొకటిగా తొలగించి చూస్తున్నట్లు కాంక్షా లోలత్వంతో మెరిసిపోసాగాయి.

"పరేవా!" బిగ్గరగా అరిచాడు కిశోర్. పాయింటర్ ఇస్పేటు ఆసు మీద ఆగింది. పై కప్పు ఎగిరిపోయేలా బిగ్గరగా ఈల వేశాడు రమణ.

చపల ముఖం దించుకుంది క్షణం పాటు. తర్వాత నిరామయంగా రమణ వంక చూస్తూ వెనక్కు తిరిగింది రెండు చేతులూ వీపు మీదకు పోనిచ్చి జాకెట్ హుక్‌లు తీయ డానికి ప్రయత్నం చేయసాగింది.

కొద్ది సెకన్ల తర్వాత "ప్లీజ్" అంది చపల. రమణ చేతి వేళ్ళు అతి లాఘవంగా చపల జాకెట్ హుక్స్ తీశాయి.

బహు నెమ్మదిగా జాకెట్ విప్పి అవతల వేసింది చపల. గిరుక్కున వెనుదిరిగిన చపల కేవలం బ్రాసరీ లంగాలలో రమణకు ఎదురుగా నిలబడిపోయింది.

రమణ మనసులో అప్పటివరకు అణగ దొక్కి వుంచబడ్డ కోరికలు గుర్రాలకంటే వేగంగా పరుగెత్తసాగాయి.

జలపాత వేగంతో ముందుకు దూకుతున్న రమణ చూపులు పాము కోరల్లా మెరిసి పోసాగాయి.

తల పైకెత్తి సూటిగా రమణ కళ్ళల్లోకి చూసింది చపల. 'మళ్లే గెల్చావు మనూ' అన్నట్లు.

పాలల్లో కడిగిన బంగారు విగ్రహంలా మెరిసిపోతున్న చపల దేహం వంక చూశాడు రమణ.

"ఈసారి ఓడిపోతే కష్టం" చపల వంక చూస్తూ అన్నాడు కిషోర్.

"పందెం వేయాల్సిందే" పట్టుదలగా అరిచాడు రమణ.

"తప్పదంటారా?" తల దించుకు అంది చపల.

"ఇంత దూరం వచ్చాక వెనక్కు తగ్గు తావా?" మీసం కొన మెలేస్తూ అన్నాడు రమణ.

"పాత పందెమేనా?" అన్నాడు కిశోర్.

వాచీ, వుంగరంతోపాటు సైకిల్ తాళం చెవి తీసి డైమండ్ ఆసు మీద వుంచాడు రమణ.

"కొత్త హీరో సైకిల్ కొని పది రోజులు కాలా" అన్నాడు కిశోర్ చపలతో.

'కాయ్ రాజా కాయ్" చక్రం తిప్పింది చపల. రమణ కళ్ళు చపలను వివస్త్రను చేసి ఆమె నగ్న దేహం వంక గుచ్చి గుచ్చి చూడసాగాయి.

చక్రం గిరగిర తిరిగి ఆగింది. చపల కళ్ళు మిలమిల మెరిశాయి.

అప్పుడు చక్రం వంక చూశాడు రమణ. పాయింటర్ కళావరాను మీద ఆగింది.

"బాడ్‌లక్ రమణా" అన్నాడు కిశోర్.

నిముషంలో జాకెట్ తొడుక్కుని చీర కట్టుకుంది చపల.

స్వర్గ ద్వారాలు ముఖం మీద భళ్ళున మూసుకున్నట్లు నిశ్చేష్టుడయ్యాడు రమణ.

'కాయ్ రాజా కాయ్' కవ్విస్తున్నట్లు అరిచింది చపల - రమణ వాచీ, వుంగరం, సైకిల్ తాళం చెవి తీసుకుంటూ.

తల దించుకు వెనుదిరిగాడు రమణ. చెమట దిగజారుతూంది - తలలో నుండి కిందకు.

"వుండరా - మళ్ళీ పందెం వేద్దాం" అంటున్న కిశోర్ మాటలు అతని చెవి కెక్కనే లేదు!

రమణ నెమ్మదిగా నడుచుకుంటూ యింటికి వెళ్ళేసరికి తూర్పు దిక్కున పొద్దు పొడుస్తుంది.

ఎమ్యూజ్ మెంట్ పార్క్ పక్కన హోటల్ గదిలో చపల, కిశోర్ ఆదమరచి నిద్రపోతున్నారాసమయాన.

*

### పెళ్ళి పిలుపు

సుజాత: "సాయంత్రం మీ ఫ్రెండ్ పెళ్లికి వెళ్లడం ఖాయమే కదా!"

రంగనాథం: "వాడి పెళ్లికి వెళ్లాలంటే నాకు సిగ్గుగా వుంది. వాడు ఇప్పటికి మూడు పెళ్లిళ్ళకు పిలిచాడు. కాని నేను మాత్రం ఒకే పెళ్లికి పిలిచాను"

—బి.ఎస్.



# షాడో మధుబాబు

## ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం రాస్తున్న సీరియల్?

డిటెక్టివ్ నవలా రచయితగా తనకంటూ కొంత మంది అభిమానుల్ని సృష్టించుకున్న మధుబాబు ప్రస్తుతం ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రికలో వస్తున్న సీరియల్స్‌కి భిన్నమైన రచన చేస్తున్నారు. నవల ఇతివృత్తం ఎన్నిక పూర్తయింది. రచనకు శ్రీకారం చుట్టడం కూడా జరిగింది.

అయితే - **మధుబాబు** నుంచి ఆంధ్రజ్యోతి పాఠకులు ఏ తరహా రచనల్ని ఆశిస్తున్నారు? అని తెలుసుకోగోరుతున్నాం.

## 'మధుబాబు రచన'

అనగానే పాఠకుల మస్తిష్కంపై ఓ చేవ్రాలు వుంది. ఆ తరహా రచననే ఆశిస్తున్నారా? అందుకు భిన్నమైన రచనను ఆశిస్తున్నారా? సహేతుకంగా పాఠకుల అభిప్రాయాన్ని తెలుసుకోగోరుతున్నాం.

పాఠకుల లేఖలలో రచయితకు నచ్చిన ఓ లేఖకు మధుప్రియ పబ్లికేషన్, మాచవరం వారు అతి చక్కని బహుమతి (558 రూపాయిల విలువ కలిగినది) అంద జేస్తారు.

పాఠకుల లేఖలు 2-8-90 లోగా ఎడిటర్, ఆంధ్ర జ్యోతి సచిత్ర వార పత్రిక, పోస్టు బాక్సు నెం. 712, విజయవాడ-520 010 చిరునామాకు పంపగలరు.